క్లుప్తంగా

జూదరులు అరెస్ట్

సింహాద్రిపురం : మండలంలోని నిడివెలగల గ్రామంలోని ఆంజనేయస్వామి గుడి వెనుక వైపు కంపచెట్లలో జూదం ఆడుతున్న నలుగురు జూదరులను గురువారం అరెస్టు చేసి వారి వద్దనుంచి రూ.22,110 నగదును స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ రోషన్ తెలిపారు. మండలంలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు జరిగినా 91211 00613 నెంబర్‌కి కాల్ చేసి సమాచారం అందించాలని సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని ఎస్ఐ తెలిపారు.

ఆలయ పునరుద్ధరణకు చర్యలు



కొలతలు తీసుకుంటున్న అధికారి దుర్గాప్రసాద్

పెద్దముడియం : మండల పరిధిలోని పెద్దపసుపుల గ్రామంలో ఉన్న పురాతన శ్రీ మాధవ–ఈశ్వర దేవస్థానాల పునరుద్ధరణకై చర్యలు తీసుకుంటున్నట్లు ఎండోమెంట్ అధికారులు తెలిపారు. ఇందులో భాగంగా గురువారం ఎండోమెంట్ అసిస్టెంట్ అధికారి దుర్గాప్రసాద్ గ్రామస్తుల సమక్షంలో దేవాలయంలో వాస్తు ప్రకారం స్థల పరిశీలన చేశారు. ఆలయ ముఖ మండపం, ప్రాకార హాలు, కళ్యాణ మండపం, యాగశాల టాయిలెట్లుకు వాస్తు ప్రకారం కొలతలు తీసుకోవడం జరిగిందని ఆయన తెలిపారు. నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆలయ అధికారి లక్షుమయ్య, దేవాలయ మాజీ చైర్మన్ వి.రత్నారెడ్డి, గ్రామస్తులు పాల్గొన్నారు.

క్రీడాపోటీలు ప్రారంభం



వాలీబాల్ ఆటను ప్రారంభిస్తున్న ఇన్‌చార్జి ఎంపీపీ రమాదేవి

లింగాల : వేల్పుల ఆదర్శ సచివాలయాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించి ఏడాది కావడంతో వార్షికోత్సవ వేడుకలను నిర్వహిస్తున్నారు. ఈ వేడుకల సందర్భంగా పులివెందుల నియోజకవర్గంలోని అన్ని మండలాల సచివాలయ ఉద్యోగులకు, వలంటీర్లకు క్రీడాపోటీలను నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా గురువారం మండల కేంద్రంలో క్రీడాపోటీలను మండల ఉపాధ్యక్షురాలు అలవలపాటి రమాదేవి ప్రారంభించారు. ఎంపీడీఓ సురేంద్రనాథ్ ఆధ్వర్యంలో క్రీడాపోటీలు సాగాయి. క్రికెట్, కబడ్డీ, వాలీబాల్, రంగవల్లుల వంటి పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మినారాయణ, ఎస్ఐ రవికుమార్, సింగిల్ విండో అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, వైఎస్సార్సీపీ నాయకులు మల్లికార్జునరెడ్డి, అన్ని సచివాలయాల సిబ్బంది, వలెంటీర్లు పాల్గొన్నారు.


18న వినాయక చవితి

కడప కల్చరల్ : వినాయక చవితి పర్వదినం గురించి సందిగ్ధత ఏర్పడడంతో ప్రజల్లో ఆ పండుగను 18, 19 తేదీల్లో ఎప్పుడు నిర్వహించుకోవాలన్న సందేహం నెలకొన్నది. కొన్ని క్యాలెండర్లు, పంచాంగాల్లో 19 అని, మరికొన్నింటిలో 18 అని ఉండడంతో ఆ పండుగను ఎప్పుడు నిర్వహించుకోవాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. ఈ అంశంపై జిల్లా అర్చక సంఘం అధ్యక్షులు, పీస్ కమిటీ ప్రతినిధి విజయ్‌భట్టర్ స్పష్టత ఇచ్చారు. శాస్త్ర ప్రకారం సెప్టెంబరు 18నే పండుగను నిర్వహించుకోవాలని, ఈ విషయంగా వినాయక చవితి వ్రత కల్పం గ్రంథంలో స్పష్టంగా ఉందన్నారు.

నూతన గ్రౌండ్‌ను వాకర్స్ సద్వినియోగం చేసుకోవాలి

కడప అర్బన్ : కడప నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయం వద్ద నూతనంగా నిర్మించిన పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌ను వాకర్స్ సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఇటీవల పలువురు పెరేడ్ గ్రౌండ్‌లో తాము నడక, ఇతర వ్యాయామాలు చేసేందుకు వినియోగించుకోవడానికి వీలుగా అనుమతి ఇవ్వాలని జిల్లా ఎస్పీకి విజ్ఞప్తి చేశారు. ఈ నేపథ్యంలో ఎస్పీ.. వాకర్స్ గ్రౌండ్‌ను వినియోగించుకోవాలని, ప్రజలు తమ ఆరోగ్య సంరక్షణకు వ్యాయామాలు చేయాలని సూచించారు.

వైభవంగా వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు



వెంకయ్యస్వామి గ్రామోత్సవ దృశ్యం

బద్వేలు అర్బన్ : స్థానిక తెలుగుగంగకాలనీలోని వెంకయ్యస్వామి ఆలయంలో గురువారం నిర్వహించిన వెంకయ్యస్వామి ఆరాధనోత్సవాలు వైభవంగా జరిగాయి. ఇందులో భాగంగా తెల్లవారుజాము నుండే స్వామివారికి పంచామృతాభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గణపతి పూజ, గణపతిహోమం, రుద్రహోమం, పూర్ణాహుతి తదితర పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

– ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి



ప్రభుత్వ పథకాల గురించి ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి

చెన్నూరు : ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయమని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి అన్నారు. గురువారం సానిక అరుంధతినగర్, సుగాలి కాలనీలలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాల్లో ఆయన పాల్గొని ఇంటింటికి తిరిగి ప్రజల సమస్యలను తెలుసుకుని అక్కడే వున్న అధికారులతో చర్చించి వారి సమస్యలను పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఎటువంటి సమస్యలు ఉండకూడదని వారికోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి ఆ పథకాల అమలు కోసం ఎంతో కృషిచేశారన్నారు. ఆ పథకాలతో లబ్ధిపొందిన ప్రజలు ఎంతో ఆనందంగా ఉన్నారన్నారు. ఆ ఆనందాన్ని ఇలాగే కొనసాగించడానికి మళ్లీ మన సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. గడప గడపలో ప్రజలు హారతులిచ్చి స్వాగతం పలుకుతున్నారన్నారు. ఎవరికి ఏ సమస్య ఉన్నా తమ దృష్టికి తెస్తే పరిష్కరించడానికి నేను సిద్ధంగా ఉన్నానన్నారు. అనంతరం చింతకొమ్మదిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పేరుతో ప్రతి కుటుంబానికి లబ్ధి చేకూరే విధంగా సంక్షేమ పథకాలను తీసుకువచ్చిన ఆయనను ఆశీర్వదించాలని ఆయన ప్రజలను కోరారు. అనంతరం అరుంధతినగర్, సుగాలి కాలనీ ప్రజలు వారి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఒక పిల్లాడికి ఆరోగ్యం సరిగాలేదని పెన్షన్ ఇప్పించి ఏదైనా మంచి ఆసుపత్రిలో చూపించాల్సిందిగా ఎమ్మెల్యేని కోరారు. స్పందించిన ఆయన డాక్టర్లతో మాట్లాడి ఆ పిల్లాడికి వైద్యం అదేవిధంగా చూస్తామన్నారు. వలంటీర్లు, సచివాలయ సిబ్బంది, అధికారులు, ప్రజా ప్రతినిధులు ఎక్కడ కూడా ఎవరికి ఇబ్బంది కలగకుండా అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అక్కడి ప్రజలను ఆయన కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆర్‌వీఎస్ఆర్, వైఎస్సార్‌సీపీ టౌన్ కన్వీనర్ ముదిరెడ్డి సుబ్బారెడ్డి, సర్పంచులు సిద్ధిగారి వెంకటసుబ్బయ్య, సొంతం నారాయణరెడ్డి, తుంగా చంద్రశేఖర్ యాదవ్, గుమ్మల మధుసూదన్ రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు అల్లి శ్రీరామ్మూర్తి, రఘురామిరెడ్డి, సాదిక్ అలీ, రఘురాంరెడ్డి, దుంప నాగిరెడ్డి, కమలాపురం నియోజకవర్గం మైనార్టీ కన్వీనర్ అన్వర్ బాషా, టీఎన్ చంద్రారెడ్డి, టీఎన్ మహేశ్వర్‌రెడ్డి, మండల కో ఆప్షన్ నెంబర్ వారిస్, అబ్దుల్ రబ్, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆదరణను చూసి ఓర్వలేకనే అసత్య ఆరోపణలు

చెన్నూరు : పార్టీ పెట్టి పది సంవత్సరాలైనా ఎమ్మెల్యే కానీ వ్యక్తి వారాహి ద్వారా ప్రజలలో తిరుగుతూ ప్రభుత్వంపై, ఎమ్మెల్యేలపై మంత్రులపై అసత్య ఆరోపణలు చేస్తూ మాట్లాడుతున్నారని, అలాగే మంగళగిరిలో ఎమ్మెల్యేగా గెలవలేని నారా లోకేష్ తనకు వచ్చీ రాని తెలుగులో పెద్దపెద్ద డైలాగులు చెబుతూ మేము అధికారంలోకి వస్తే బట్టలు ఊడదీస్తాం, అంతు చూస్తాం అంటూ పసలేని యువగలం యాత్రలు చేస్తున్నారని ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డి అన్నారు. గురువారం రాత్రి ఎంపీపీ చీర్ల సురేష్ యాదవ్ స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పినవి చెప్పినట్లు నవరత్నాల ద్వారా సంక్షేమ పథకాలు అందించారు కాబట్టే నేడు ప్రజల్లోకి నిర్భయంగా వెళ్లగలుగుతున్నామని ప్రజలు కూడా బ్రహ్మరథం పడుతున్నారన్నారు. దొడ్డి దారిన మంత్రి అయిన లోకేష్ యువగళంలో ఏమి మాట్లాడుతున్నాడో అర్థం కావడంలేదన్నారు. చరిత్రను తిరగరాసిన ఘనత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. మిగతా రాష్ట్రాలకు మార్గదర్శకంగా ఉండే విధంగా పాలన సాగిస్తున్నాడన్నారు. కరోనా కష్టకాలంలో కూడా రాజీ పడకుండా చెప్పిన విధంగా ప్రజలకు సంక్షేమ పథకాలు అందించారని ప్రజలు అభినందిస్తుంటే చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్ వారాహి యాత్ర, నారా లోకేష్ యువగలం పేరుతో రోడ్లమీద పడి ప్రభుత్వాన్ని, మంత్రులను, ఎమ్మెల్యేలను తిట్టే కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. మంగళగిరిలో గెలవలేని నారా లోకేష్ కూడా ప్రభుత్వాన్ని విమర్శించడం సిగ్గుచేటని ఆయన అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

వేరుశనగలో చీడపీడల నివారణపై శ్రద్ధవహించాలి

ముద్దనూరు : వేరుశనగ సాగులో చీడపీడల ఉధృతిని గమనించి వాటి నివారణపై రైతులు శ్రద్ధ వహించాలని డివిజనల్ వ్యవసాయ సహాయ సంచాలకులు వెంకటసుబ్బయ్య సూచించారు. గురువారం మండలంలోని బొందలకుంట గ్రామంలో డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఏడీఏ మాట్లాడుతూ ప్రతి వారం పొలంలో వ్యవసాయ పరిసరాల విశ్లేషణ నిర్వహిస్తున్నట్లు, పొలంబడి ద్వారా తక్కువ ఖర్చుతో ఎక్కు దిగుబడి సాధించే సలహాలు అందుతాయని తెలిపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి వెంకట కృష్ణారెడ్డి మాట్లాడుతూ సేంద్రీయ సాగులో భాగంగా రసాయన ఎరువుల వినియోగం తగ్గించడం, శత్రు, మిత్ర పురుగుల నిష్పత్తి, పంట పెరుగుదల దశ అంశాలపై వివరించారు.

ఘనంగా 'మమ్మ' స్మృతి దినోత్సవం

కడప కల్చరల్ : బ్రహ్మకుమారి ఈశ్వరీయా విశ్వవిద్యాలయ తొలి పరిపాలనాధికారి మాతేశ్వరి జగదంబ సరస్వతి (మమ్మ) 58వ స్మృతి దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఓంశాంతి నగర్‌లోని సంస్థ ప్రధాన కార్యాలయంలో సాయంత్రం ఈ కార్యక్రమం చేపట్టారు. సంస్థ అదనపు ఏపీ, కర్ణాటక సబ్ జోన్ అధికారి, జిల్లా కో ఆర్డినేటర్ గీతా బెహన్ ఈ సందర్భంగా మమ్మ చిత్రపటానికి పూలమాల అలంకరించి జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు. అనంతరం ఆమె కార్యక్రమానికి హాజరైన వారికి మమ్మజీ గురించిన వివరాలను తెలిపారు. ఆమె జీవితం, సుగుణాలు, వ్యక్తిత్వం, జ్ఞానం ప్రేరణగా తీసుకుని ఆ మార్గంలో నడవాలని సూచించారు.

లేబాకను సందర్శించిన డీఎంహెచ్‌ఓ



అంగన్ వాడీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ

వల్లూరు : మండలంలోని పెద్ద లేబాక గ్రామాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి నాగరాజు గురువారం సందర్శించారు. మొదట గ్రామంలోని విలేజ్ హెల్త్ క్లీనిక్‌ను సందర్శించి పలు రికార్డులను పరిశీలించారు. క్లీనిక్‌లో అందుతున్న వైద్య సేవలను పరిశీలించారు. క్లీనిక్‌లో వైద్య సేవలు పొందుతున్న స్థానికులతో వైద్య సేవల గురించి, సిబ్బంది పనితీరు గురించి ఆరా తీశారు. షుగర్, బీపీ రోగులకు, హై రిస్క్ గర్భిణులకు అందుతున్న వైద్య సేవలను గురించి ఆరా తీసి పలు సూచనలు చేశారు. అనంతరం స్థానిక అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న పౌష్టికాహారం, ఐరన్ మాత్రలతో పాటు ఇతర సేవలను గురించి ఆరా తీశారు. స్థానిక మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థులకు హెచ్‌బీ టెస్ట్ గురించి, పోషకాహార ఆవశ్యకత, హ్యాండ్ వాష్, పరిశుభ్రత గురించి వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఫణీంద్ర, సీహెచ్‌వో వేణుగోపాల్, హెల్త్ సూపర్‌వైజర్‌లు సుధాకర్, ప్రసాద్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

చంద్రయాన్ 3 విజయోత్సవ ర్యాలీ



చింతకొమ్మదిన్నెలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు



వేంపల్లెలో జాతీయపతాకంతో..

చింతకొమ్మదిన్నె : స్థానిక జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు మండల విద్యాశాఖాధికారి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో గురువారం చంద్రయాన్ 3 విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ చంద్రుడిపై విక్రమ్ ల్యాండర్ విజయవంతంగా దిగడానికి ఇస్రో శాస్త్రవేత్తలు చేసిన కృషి ఎనలేనిదన్నారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : చంద్రయాన్ 3 విజయవంతంపై వేంపల్లెలోని ఉషాకిరణ్ పాఠశాల విద్యార్థులు వేంపల్లె పురవీధులలో 500 అడుగుల భారీ జాతీయ పతాకంతో విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీని ఎస్ఐ తిరుపాల్ నాయక్ ప్రారంభించారు. జయహో భారత్ నినాదాలతో ర్యాలీ నాలుగు రోడ్ల కూడలికి చేరుకుని శాస్త్రవేత్తలకు అభినందనలు తెలియజేశారు. బాణాసంచా కాల్చి సంబరాలు చేసుకున్నారు. కరస్పాండెంట్ బి.ఎస్.రమణారెడ్డి మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీకి ఈ సందర్భంగా ధన్యవాదాలు తెలియజేశారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

రైతులు స్వయంగా నిర్ణయాలు తీసుకోవాలి



లింగాల : ఈ క్రాప్ నమోదును పరిశీలిస్తున్న ఏడీఏ అశోక్‌రెడ్డి

కమలాపురం : రైతులు తాము సాగు చేసే పంటల పెంపకంలో స్వయంగా నిర్ణయాలను తీసుకునే శాస్త్రవేత్తలుగా తయారు చేయడమే పొలంబడి లక్ష్యం అని మండల ఏఓ సరస్వతి తెలిపారు. గురువారం మండల పరిధిలోని టి.చదిపిరాళ్లలో జరిగిన డాక్టర్ వైఎస్సార్ పొలంబడి కార్యక్రమంలో వరిపంట సాగు–తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆమె రైతులకు అవగాహన కల్పించారు. ప్రతి రైతును తన పొలానికి శాస్త్రవేత్తను చేయడమే డాక్టర్ వైఎస్సార్ పొలంబడి లక్ష్యం అన్నారు. నాట్లు నాటిన తర్వాత కలుపు నివారణలో యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. నారు నాటిన 24–48 గంటల్లో బ్యూటక్లోర్ 1 లీటరును ఏకరాకు ఇసుకలో కలిపి చల్లుకోవాలన్నారు. అలాగే ప్రత్యక్ష నిరూపణ పద్ధతి ద్వారా వేప గింజల కాషాయ ద్రావణం తయారు చేసే విధానంపై అవగాహన కల్పించారు. ఈ కషాయం ద్వారా పురుగులను గుడ్డు దశలోనే నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో వీఏఏలు మమత, వెంకటకృష్ణ, రైతులు పాల్గొన్నారు.

ఈ క్రాప్ నమోదు పరిశీలన

లింగాల : మండలంలోని ఇప్పట్ల గ్రామంలో జరుగుతున్న ఈ క్రాప్ నమోదు కార్యక్రమాన్ని పులివెందుల ఏడీఏ అశోక్‌రెడ్డి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంటలు సాగుచేసిన ప్రతి సర్వే నెంబర్‌లో ఉన్న పంటలకు ఈ క్రాప్ నమోదు చేయాలని ఆర్బీకే సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఏఓ రమేష్, ఆర్బీకే ఇన్‌చార్జి హరిశిల్ప, రైతులు పాల్గొన్నారు.

పిల్లల భద్రతపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న డీఈఓ రాఘవరెడ్డి

పులివెందుల టౌన్ : ఉపాధ్యాయులు విద్యార్థుల భద్రతపై చర్యలు తీసుకోవాలని డీఈఓ వై.రాఘవరెడ్డి తెలిపారు. గురువారం స్థానిక పులివెందుల అహోబిలాపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హెచ్ఎంలతో సమావేశం నిర్వహించారు. 52 ఉన్నత పాఠశాలల హెచ్ఎంలు, 7 మంది ఎంఈఓలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధతీసుకోవాలని సూచించారు. ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, మహిళా పోలీసు, సంక్షేమ సహాయకులు, పిల్లల తల్లిదండ్రులు, అంగన్‌వాడీ టీచర్లు తదితరులతో పాఠశాల స్థాయిలో విపత్తు నిర్వహణ కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. ట్యాబ్‌ల వినియోగం, ఉపాధ్యాయులు ముఖ హాజరు తదితర వాటిపై చర్చించారు.

ఎయిడ్స్ వ్యాధి నివారణపై అవగాహన

వేంపల్లి : నియంత్రణ సంస్థ, జిల్లా ఎయిడ్స్ నియంత్రణ సంస్థ వారి ఆదేశాల మేరకు కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో వేంపల్లి పోలీస్‌స్టేషన్ నందు ఎస్‌టీఐ, హెచ్ఐవీ, ఎయిడ్స్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీఐ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎఫ్ఎస్‌డబ్ల్యూ, ఎంఎస్ఎం టీజీలు పడుతున్న ఇబ్బందుల గురించి, అలాగే వారు సమాజంలో ఎదుర్కొంటున్న ఇబ్బందుల గురించి మాట్లాడారు. అలాగే హెచ్ఐవీ ఏ విధంగా వస్తుందో వివరించారు. వేంపల్లిలో కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో బాగా పని చేస్తున్నారని ప్రశంసించారు. హెచ్ఐవీ వ్యాధి నుంచి కాపాడటం అంటే మామూలు విషయం కాదని ఇలా కాపాడుతున్న ప్రతి ఒక్కరికి సీఐ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో కమ్యూనిటీ డెవలప్‌మెంట్ సొసైటీ ప్రాజెక్టు మేనేజర్ ఎస్.వల్లి, ఐసీటీసీ కౌన్సిలర్ ఆంజనేయులు, ఇండియా లింక్ వర్కర్ స్కీమ్ డిస్ట్రిక్ట్ రిసోర్స్ పర్సన్ ఎస్.అల్లావలి, కమ్యూనిటీ డెవలప్మెంట్ సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

ఆడిట్ క్రమం తప్పకుండా చేయాలి



మాట్లాడుతున్న డీసీపీఓ సుభాషిణి

కమలాపురం : స్వయం సహాయక సంఘాల అధ్యక్ష, కార్యదర్శులు తమ సంఘాలకు సంబంధించిన ఆడిట్‌ను ప్రతి సంవత్సరం క్రమం తప్పకుండా చేయాలని డీసీపీఓ సుభాషిణి తెలిపారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో కమలాపురం మండల సమాఖ్య అధ్యక్షురాలి ఆధ్వర్యంలో నిర్వహించిన వార్షిక సమావేశంలో ఆమె మాట్లాడారు. గత ఆర్థిక సంవత్సరం ఆడిట్ నివేదిక, ప్రగతి నివేదిక చదివి వినిపించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సొసైటీ యాక్ట్ కింద రిజిష్టర్ అయిన గ్రామ సంఘాలు, మండల సమాఖ్య నిర్వాహకులు (వీఓఏ) క్రమం తప్పకుండా ఆడిట్ చేసుకోవాలన్నారు. రుణాలను ఇవ్వడమే కాక రికవరీ బాధ్యత కూడా సమాఖ్య నిర్వాహకులదేనన్నారు. ప్రతి నెల సమావేశాలు నిర్వహించి పొదుపు, బ్యాంక్ లింకేజీ, స్త్రీనిధి తదితర వాటిపై చర్చించాలన్నారు. ప్రతి సంఘం ప్రగతి సాధించేందుకు వీఓఏలు కృషి చేయాలన్నారు. ఎంపీడీఓ చలపతి మాట్లాడుతూ మహిళా సాధికారతకు కట్టుబడి ఉండాలన్నారు. అలాగే మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న పథకాల గురించి వివరించాలన్నారు. కార్యక్రమంలో ఏపీఎం అపర్ణ, సీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.

నా మట్టి-నాదేశం వీరులకు వందనం



పులివెందులలో మట్టి కలశాన్ని అందజేస్తున్న మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి

లింగాల : నా మట్టి నా దేశం వీరులకు వందనం కార్యక్రమంలో భాగంగా లింగాల మండలంలోని అన్ని గ్రామాల సచివాలయాల నుంచి మట్టిని సేకరించారు. గురువారం ఈ మట్టిని లింగాల ఎంపీడీఓ సురేంద్రనాథ్, తహసీల్దార్ లక్ష్మినారాయణ, సర్పంచ్ దస్తగిరమ్మ చేతుల మీదుగా స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు, మండల కో ఆర్డినేటర్ మస్తాన్‌బాషాలకు మట్టి కలశం అందించారు. ఈ మట్టి కలశాన్ని ఢిల్లీకి పంపడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అన్ని సచివాలయాల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, వలెంటీర్లు పాల్గొన్నారు.

పులివెందులలో..

పులివెందుల టౌన్ : పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని 18 సచివాలయాల పరిధిలో నిర్వహించిన నామట్టి–నాదేశం–వీరులకు వందనం కార్యక్రమాలలో సేకరించిన మట్టి కలశాల మట్టిని ఒక కలశంగా చేసిన మట్టి కలశాన్ని గురువారం మున్సిపల్ కార్యాలయంలో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి చేతులమీదుగా స్నేహిత అమృత హస్తం సేవా సమితి అధ్యక్షుడు రాజు, పట్టణ అధ్యక్షుడు మహమ్మద్ రఫీలకు అందజేసిన ఈ కళశాన్ని ఢిల్లీకి పంపడం జరుగుతుందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సచివాలయాల సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

30 నుంచి సమరభేరీ

కడప వైఎస్ఆర్ సర్కిల్ : బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలపై ఈ నెల 30 నుంచి సెప్టెంబర్ 4 వరకు సమర భేరీ నిర్వహిస్తున్నట్లు సీపీఎం జిల్లా కార్యదర్శి చంద్రశేఖర్ పేర్కొన్నారు. గురువారం సీపీఎం కార్యాలయంలో సమర భేరి పోస్టర్లను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పేద, మధ్య తరగతి ప్రజలు అధిక ధరలతో అల్లాడుతుంటే మోడీ అధికారంలోకి వచ్చాక వంట గ్యాస్ ధర రూ. 450 ఉంటే దానిని రూ. 1200 పెంచడంతో పాటు పెట్రోల్, డీజల్ ధరలను అమాంతంగా పెంచారన్నారు. ఈ సమస్యలపై సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆందోళనలను జయప్రదం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు దస్తగిరి రెడ్డి, రామ్మోహన్, శ్రీనివాసులు రెడ్డి, అన్వేష్ పాల్గొన్నారు.


ప్లాంట్ పనులను పూర్తి చేయాలి

కడప కార్పొరేషన్ : కడప నగర శివార్లలోని నానాపల్లె వద్ద కొత్త సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మున్సిపల్ కమిషనర్ ప్రవీణ్ చంద్ అన్నా రు. గురువారం మార్నింగ్ విజిట్‌లో భాగంగా పబ్లిక్ హెల్త్ అధికారులతో కలిసి ఎస్‌టీపీ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అడ్మిన్ బ్లాక్, పంప్‌హౌస్ పనులను వేగవంతం చేయాలన్నారు. సీవేజ్ పాయింట్లను పూర్తి స్థాయిలో ఉపయోగంలోకి వచ్చేలా చూడాలన్నారు. ప్రతిరోజూ పనులు జరిగేలా చర్యలు చేపట్టాలన్నారు. పబ్లిక్ హెల్త్ ఈఈ చెన్నకేశవరెడ్డి, నగరపాలక డీఈ రాజేష్ పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఫిట్ ఇండియా కార్యక్రమం

వైవీయూ : వైవీయూలో 'ఫిట్ ఇండియా' కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు క్రీడాపోటీలు నిర్వహించారు. వైవీయూ ఎన్ఎస్ఎస్ యూనిట్–9 ఆధ్వర్యంలో వాలీబాల్, టగ్ ఆఫ్ వార్ తదితర క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. వైవీయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. ఎన్. వెంకటరామిరెడ్డి పోటీలు ప్రారంభించి మాట్లాడారు. మేజర్ ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని ఈనెల 29న జాతీయ క్రీడాదినోత్సవం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డా. కె. శ్రీనివాసరావు, ఎంపీఏ విభాగాధిపతి డా. రెడ్డయ్య పాల్గొన్నారు.

దేశసేవ చేసే అవకాశం రావడం మహాభాగ్యం



మాట్లాడుతున్న సీఆర్‌పీఎఫ్ డిప్యూటీ కమాండెంట్ ఎ.ఆర్. అభిలాష్

వైవీయూ : భారతదేశ గడ్డపై జన్మించిన మనకు దేశ సేవ చేసే అవకాశం వస్తే మహాభాగ్యంగా భావించి సేవలందించాలని సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ డిప్యూటీ కమాండెంట్ ఎ.ఆర్. అభిలాష్ పేర్కొన్నారు. గురువారం వైవీయూలోని సర్ సీవీ రామన్ సైన్స్‌బ్లాక్‌లో మనోవిజ్ఞానశాస్త్రశాఖ, జాతీయసేవా పథకం సంయుక్త ఆధ్వర్యంలో 'జాతీయ సమైక్యత–భద్రత' అన్న అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యవక్తగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ యూపీఎస్‌సీ ద్వారా సైనిక విభాగంలో బాధ్యతలు చేపట్టానన్నారు. జమ్ముకాశ్మీర్‌లో జరిగిన పుల్వామా ఘటన సమయంలో విధుల్లో ఉన్న విషయం గుర్తుచేశారు. చైనా వంతెనను భారతదేశం స్వాధీనం చేసుకునే సమయంలో సైనికుల వీరోచిత పోరాటాన్ని వివరించారు. యూపీఎస్‌సీ పరీక్షల ద్వారా భారతసైన్యంలోకి రావాలని యువతకు పిలుపునిచ్చారు. అనంతరం వీసీ ఆచార్య చింతా సుధాకర్‌ను ఆయన చాంబర్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, కార్యక్రమ కన్వీనర్లు డా. వేపరాల లాజరస్, డా. ఎస్. సునీత, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డా. ఎన్. వెంకటరామిరెడ్డి, సైకాలజీ సహ ఆచార్యులు డా. కె. లలిత పాల్గొన్నారు.

మాతృ భాషపై మమకారం పెంచుకోవాలి



పోటీలను పర్యవేక్షిస్తున్న విద్యాశాఖాధికారి అనిత

కమలాపురం : ప్రతి విద్యార్థి మాతృ భాషపై మమకారం పెంచుకోవాలని ఎంఈఓ బేబి తెలిపారు. గురువారం స్థానిక ఎంఆర్‌సీ కార్యాలయం ఆవరణలో తెలుగు భాషా దినోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులకు తెలుగుభాషపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు మండలంలోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. కాగా అంబేద్కర్ గురుకుల పాఠశాలకు చెందిన సి.అనూష, నల్లింగాయపల్లె హైస్కూల్‌కు చెందిన వెంకటజగన్‌లు ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచినట్లు ఎంఈఓ తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి విద్యార్థి తెలుగు భాషపై పట్టు సాధించాలన్నారు. తెలుగుభాష తియ్యదనం ప్రతి ఒక్కరికి రుచి చూపించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఎంఆర్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

మాతృభాషా వికాస వారోత్సవాలు ప్రారంభం

వీరపునాయునిపల్లె : స్థానిక విద్యాశాఖ కార్యాలయంలో గురువారం మాతృభాష వికాస వారోత్సవాలలో భాగంగా తెలుగు భాషా ప్రతిభా పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను మండల విద్యాశాఖ అధికారి 2 అనిత పర్యవేక్షించారు. పోటీల్లో సంగమేశ్వర ఉన్నత పాఠశాల విద్యార్థిని నవ్యశ్రీ ప్రథమ స్థానం సాధించగా పాయసంపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన వెంకటలక్ష్మి ద్వితీయ స్థానం సాధించింది. వీరికి బహుమతులు అందజేశారు. అనంతరం మండల విద్యాశాఖ అధికారి 2 అనిత మాట్లాడుతూ ప్రస్తుతం పోటీల్లో పాల్గొని ప్రతిభ చూపిన ఇద్దరు విద్యార్థులు డివిజన్ స్థాయిలో నిర్వహించే పోటీలకు హాజరు కావాలన్నారు. గిడుగు రామమూర్తి రచించిన ఆధునిక తెలుగు భాషా రచనలు ప్రజలపై ఎంతో ప్రభావం చూపిస్తున్నాయన్నారు. ఉదాహరణకు కన్యాశుల్కం నాటకం ఆనాటి సమాజంపై చూపిన ప్రభావం ఎంతటిదో తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సింహాద్రిపురంలో

సింహాద్రిపురం : ఈనెల 29న తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా మండల స్థాయిలో గురువారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు తెలుగు భాషపై పోటీలు నిర్వహించారు. రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ వారు పంపిన ప్రశ్నా పత్రాలను వైఎస్ఆర్ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. అనంతరం ఆ ప్రశ్నా పత్రాలను పిల్లలకు అందించి పరీక్ష నిర్వహించగా అందులో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల కోవరంగుట్టపల్లి పి.లాస్య 9వ తరగతి మొదటి స్థానాన్ని, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల రావులకొలను పి.జోషిక ద్వితీయ స్థానాన్ని సాధించారు. కార్యక్రమంలో ఎం.ఎస్ కో ఆర్డినేటర్ అరవింద్, ఎంఆర్‌సీ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నెలో..

చింతకొమ్మదిన్నె : తెలుగు భాషా దినోత్సవం సందర్భంగా మండలంలోని ఎంఆర్‌సీ కార్యాలయంలో గురువారం విద్యార్థులకు వ్యాసరచన పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంఈవో 1 వెంకటరామిరెడ్డి, ఎంఈవో 2 రమాదేవిలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో నాగిరెడిపల్లిలోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన విద్యార్థులు మొదటి బహుమతి బి.అఖిల, రెండవ బహుమతి ఎస్.నసస్రిమిన్‌లు సాధించారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందించి అభినందించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.